

# పడకేసిన పారిశుధ్యం

గాంధీ హాస్పిటల్ నుంచి పద్మారావు నగర్ వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

## ప్రజావాణికి 56 దరఖాస్తులు

సిటీ బ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 56 దరఖాస్తుల రాగా.. అందులో గృహ నిర్మాణ శాఖకు 18, పింఛన్ 10, ఇతర శాఖలకు సంబంధించినవి 28 దరఖాస్తులు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీ ముకుంద రెడ్డి, డీఆర్ఓ ఈ వెంకటాచారి, ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధికారులు పవన్ కుమార్, ఆశన్న, సుబ్రహ్మణ్యం, కోటాజీ, సురేందర్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ పాల్గొన్నారు.

## ఆసిఫ్‌నగర్‌లో కుప్పకూలిన లిఫ్ట్

మెహిదీపట్నం ఏప్రిల్ 7: లిఫ్ట్ కూలి ముగ్గురికి గాయాలైన సంఘటన ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్ నగర్ డివిజన్ మురాద్‌నగర్ ఛోటీ మసీద్ సమీపంలోని నాకోషమ్స్ అపార్ట్‌మెంట్లో ఆదివారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా నాలుగో అంతస్తు నుంచి లిఫ్ట్ కిందికి కూలింది. ఈ ప్రమాదంలో లిఫ్టులో ఉన్న సయ్యద్ నసీర్ (40), సకీనా బేగం(30), మైమున్నీసా బేగం(35) కు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజీద్ హుస్సేన్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటుకై..

- నేడు ఇందిరాపార్కు వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్ష
- ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్ఎస్ అధికారులు



ఇందిరాపార్కు వద్ద దీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు

కవాడిగూడ, ఏప్రిల్ 7: అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దీక్ష చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ జాగృతి నాయకులు నవీన్ ఆచారి, యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ బొళ్ల శివశంకర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులుఇందిరాపార్కు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు శ్రీధర్‌రావు,పెంటారాజేష్, యునైటెడ్ పూలే ఫ్రంట్‌నాయకులు హరి, సదానంద్, మారయ్య, వీరన్న, విజేందర్‌సాగర్, నరేష్‌కుమార్, అశోక్‌యాదవ్, లింగం, శాలివాహన, పుష్పచారి తదితరులు ఉన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

## 31 గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలి

**ఫ్యూచర్ సిటీ జేఏసీ నేతల డిమాండ్**

**మహేశ్వరం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ**

బడంగ్‌పేట్, ఏప్రిల్ 8: మహేశ్వరం మండలంలోని 31 గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని ఫ్యూచర్ సిటీ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ రఘుపతి మాట్లాడుతూ.. మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు, మొహబ్బత్ నగర్ గ్రామాలను మాత్రమే ఫ్యూచర్ సిటీలోకి తీసుకొని 31 గ్రామాలను పక్కన పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న రైతులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు విమానాశ్రయం, ఫ్యాబ్ సిటీ, ఔటర్ రింగ్‌రోడ్డు, హార్డ్‌వేర్ పార్క్, ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ విద్యాసంస్థల ఏర్పాటు కోసం దాదాపు 20,000 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అందజేశారని ఆయన అన్నారు. ఈ ప్రాంత ప్రజల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మిగిలిన 31 గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కర్రోల చంద్రయ్య, కర్నాటి మనోహర్, యాదగిరి గౌడ్, దత్తు నాయక్,దర్శన్ యాదవ్, నర్సింహ యాదవ్ సీతారాం నాయక్, రవీందర్ రెడ్డి, దుడ్డు కృష్ణ యాదవ్, నర్సింహ గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## 60శాతం రాయితీపై పుస్తకాలు

**ఏప్రిల్ 8 నుంచి 17 వరకు ప్రత్యేక పుస్తక ప్రదర్శన**

**తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ హనుమంతరావు**

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 7: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం ప్రచురణల విభాగం ప్రచురించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించడానికి ప్రత్యేక పుస్తక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నాంపల్లి ప్రాంగణంలోని పుస్తక విక్రయ కేంద్రంలో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల పుస్తక ప్రదర్శన ఉంటుందని ఆయన వెల్లడించారు. ప్రతి పుస్తకంపై 60శాతం వరకు రాయితీ ఇస్తున్నామని రిజిస్ట్రార్ తెలిపారు. ప్రాచీన గ్రంథాలు, సాహిత్యం, నిఘంటువులు, సంగీత, నృత్య గ్రంథాలు, భారత, భాగవతాలు, ప్రబంధాలు, పురాణాలు, పంచ కావ్యాలు, ఇతిహాసాలు, చరిత్ర గ్రంథాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు తగ్గింపు ధరలలో విక్రయానికి సిద్ధంగా ఉంటాయని, సాహితీ వేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, భాషా ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

**తెలంగాణ యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం**

ఖైరతాబాద్, ఏప్రిల్ 7 : కాంట్రాక్ట్ అధ్యాపకుల పొట్టలు కొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నం. 21ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం ప్రతినిధులు డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ పరుశురాం, డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ లెక్చర్లను రెగ్యూలరైజ్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, మెనిఫెస్టోలో కూడా పొందుపర్చిందన్నారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో సుమారు 1,270కు పైగా కాంట్రాక్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారన్నారు. 15 నెలల నుంచి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. గత 25, 30 సంవత్సరాల నుంచి పని చేస్తున్నా తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, వర్క్‌లోడ్ లేదు అన్న సాకులతో తమను తొలగించాలని చూస్తోందన్నారు. జీవో 21 ప్రకారం నియామకాలు జరిగితే తమ కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో కాంట్రాక్ట్ అధ్యాపక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఉపేందర్ రావు, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, సూర్యరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ పోటీల్లో సత్తాచాటిన 'ఎంఎల్ఆర్'

**నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు కైవసం**

దుండిగల్, ఏప్రిల్ 7: చండీగఢ్‌లోని జాతీయ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి 5 పతకాలు సాధించినట్లు ఆ కళాశాల యాజమాన్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 6,7 తేదీలలో పంజాబ్‌లోని సెక్టార్ 63 మొహాలీలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 7వ జాతీయ మాస్టర్స్ గేమ్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆయన అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు.81 సంవత్సరాల వయస్సులోనూ తనకేమాత్రం తిరుగులేదని మర్రి లక్ష్మణ్ రెడ్డి నిరూపించారన్నారు.400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బంగారు పతకం,200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బంగారు పతకం,100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో వెండి పతకం, రిలే ఈవెంట్‌లలో రెండు కాంస్య పతకాలను సాధించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెటరన్ అథ్లెట్ , ఎంఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా, వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా బలంగా, ఆరోగ్యంగా ఉండగలరన్నారు. తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చుననీ తెలిపారు. ఎంఎల్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజ్‌గిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ జాతీయ స్థాయి పోటీలలో తన తండ్రి సాధించిన విజయాలు కేవలం వ్యక్తిగత మైలురాళ్లు మాత్రమే కాదని, యువతరానికి స్పష్టమైన సందేశం అని అన్నారు. ఎంఎల్ ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.శ్రీనివాస్ రావు హర్షం వ్యక్తం చేశారు.

## ఐదు నెలల జీతాలు వెంటనే చెలించాలి

**జీపీ కార్మికుల నిరసన వంటావార్పు**

శామీర్ పేట ఏప్రిల్ 7 : మజీద్ పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు వంటావార్పు సహపంక్తి భోజనాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఐదు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందుల పడుతున్నామని ఇంట్లో పూట గడవని పరిస్థితి నెలకొందన్నారు. ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలల జీతాలు వెంటనే చెల్లించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఇట్టబోయిన పోచయ్య, కృష్ణ, శంకరయ్య, అర్జున్, కవిత, నర్సమ్మ, లక్ష్మి, అనసూయ, సబిత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# పడకేసిన ప్రత్యేక పాలన

**మున్సిపాలిటీలలో సమస్యల తిష్ట**

**ధృవపత్రాల జారీలో తీవ్ర నిర్లక్ష్యం**

**కార్యాలయాల చుట్టూ అర్జీదారుల ప్రదక్షిణలు**

మేడ్చల్, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): మున్సిపాలిటీల నుంచి సకాలంలో ధృవపత్రాలు జారీ చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 మున్సిపాలిటీలలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ధృవపత్రాల కోసం ప్రజలు చేసిన దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పేరుకపోతున్నాయి. దీంతో సంబంధిత కార్యాలయాలు చుట్టూ ప్రజలు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగానే పట్టణాల పరిధిలో జనన, మరణ ధృవపత్రాల కోసం దరఖాస్తులు అధికంగా వస్తుంటాయి. దీనికి తోడు మున్సిపాలిటీలలో కొనసాగుతున్న ప్రత్యేక పాలన నేపథ్యంలో ధృవపత్రాల జారీలో త్రీవ జాప్యం నెలకోనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలలో విలీనం చేసిన విషయం తెలిసిందే. గతంలో 28 గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయగా.. మరో 3 మున్సిపాలిటీలలను నూతనంగా ఏర్పాటు చేసి ఇందులో 34 గ్రామాలను విలీనం చేసే పక్రియ ప్రస్తుతం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయా మున్సిపాలిటీల్లో జనన, మరణ ధృవపత్రాలతో పాటు ఇంటి అనుమతులు, ఇంటి నంబర్లు, మ్యూటేషన్లు, నల్లా అనుమతులు పొందాడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి పనికి రోజుల తరబడి సమయం పడుతోందని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

**పన్ను వసూళ్లపై ఉన్న దృష్టి అభివృద్ధిపై లేదు..**

మున్సిపల్ అధికారులకు పన్ను వసూళ్లపై ఉన్న దృష్టి అభివృద్ధిపై లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యలపై ఫిర్యాదు చేస్తే మున్సిపాలిటీలలో తగినంత నిధులు లేవని ఇప్పుడు పనులు చేయలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలకు నియమించిన ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు మున్సిపాలిటీలలో సేవలను సత్వరమే అందించేవిధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై నిపుణల కమిటీ

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**బుద్ధభవన్‌లో ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ**



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, ఏప్రిల్7(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ పూర్తయితే చాలా సమస్యలకు పరిష్కారం చూపినట్లవుతుందని, ఈ ప్రక్రియను వీలైనంత వరకు త్వరగా పూర్తిచేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన నేరుగా ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలు అప్పగించారు. మొత్తంగా 57 ఫిర్యాదులు అందాయి.సంబంధిత శాఖల నుంచి సేకరించిన సమాచారంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తున్న సమయంలో ప్రజల అభ్యంతరాలను స్వీకరిస్తామని రంగనాథ్ తెలిపారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు ఉద్దేశించి లేక్ ఎన్యూమరేషన్ యాప్‌లో అభ్యంతరాలు చెప్పడానికి ప్రత్యేక కాలమ్ పెట్టాలని సూచించారు. చెరువుల్లో ఓ వైపు నుంచి మట్టిని నింపడంతో పాటు మురుగునీరు నిరంతరంగా వచ్చిచేరడంతో ఎఫ్‌టీఎల్ పరిధులు మారిపోతున్న నేపథ్యంలో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ వేగంగా జరగాల్సి ఉందని రంగనాథ్ చెప్పారు. గ్రామ, రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులతో పాటు ఎన్ఆర్ఎస్‌సీ శాటిలైట్ ఇమేజ్‌లతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతోందన్నారు. ఎక్కువగా ఎఫ్‌టీఎల్‌పై ఫిర్యాదులు రావడంతో ప్రత్యేకంగా నిపుణుల కమిటీని కూడా వేసి ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఫిర్యాదుదారులకు వివరించారు.

**ప్రభుత్వ స్థలాల కబ్జాపై ఫిర్యాదులు..**

వీటితో పాటు పలుకాలనీలకు మధ్య రహదారులకు ఆటంకాలు కలిగించడం, పాత లే అవుట్ల హద్దులను పట్టించుకోకుండా కబ్జా చేయడం, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ప్లాట్లుగా చేసి అమ్మేయడం వంటి ఫిర్యాదులందాయని హైడ్రా అధికారులు చెప్పారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం మెట్టుకానిగూడ, గాజుల రామారం గ్రామంలో సర్వే నంబర్ 161లో ఉన్న పార్క్ స్థలంతో పాటు ఆ పక్కనే ప్రభుత్వ స్థలాన్ని కూడా కబ్జా చేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. కాప్రా చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ అయ్యిందని, ఫెన్సింగ్‌ను తొలగించి కొంతమంది అక్కడ చెరువులోకి వచ్చి కబ్జా చేస్తున్నారని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దుండిగల్ మున్సిపాలిటీలోని మల్లంపేటహైరైజ్ పీవీఆర్ మెడోస్ వాళ్లు ఇతర కాలనీలకు వెళ్లే మార్గాలను మూసేశారని మల్లంపేట నివాసితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. పటాన్ చెరువులో తిమ్మక్క చెరువుకు నీరందించే పెద్దవాగును ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసిందని, 30 మీటర్ల వెడల్పు వాగుకు తోడు ఇరువైపులా 9మీటర్ల చొప్పున బఫర్ ఉండాల్సిన విస్తీర్ణం కుంచించుకుపోయిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఉప్పల్, పీర్జాదిగూడ మున్సిపాలిటీ పార్వతీపురి గ్రామంలో 3 ఎకరాల సమాధుల భూమి తమదంటూ పట్టాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని మరో ఫిర్యాదు అందిందని హైడ్రా అధికారులు తెలిపారు.

# మొగులయ్య హత్య కేసులో అల్లుడే నిందితుడు



హత్యకు పాల్పడ్డ మల్లేశ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

దోమ, ఏప్రిల్ 7: దోమ పోలీస్‌స్టేషన్ పరిదిలోని ఖమ్మంనాచారం గ్రామానికి చెందిన బోయిని మొగులయ్య(60) హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చారు. నిందితుడు మోత్కూర్ గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేష్ మేస్త్రీ పని చేస్తూ జీవనం గడిపేవాడు. మల్లేశ్ అతని భార్య దాంపత్య జీవితంలో చిన్న చిన్న గొడవలు పడేవారు.ఒక రోజు ఇద్దరి మధ్య గొడవ జరిగి మల్లేశ్ భార్య తల్లిగారి ఊరైన ఖమ్మనాచారం వెళ్లింది.అప్పుడు మృతుడు మామ మొగులయ్య సర్ది చెప్పి ఆమెను అత్తగారింటికి పంపాడు. మరలా కొన్నాళ్లకు ఇద్దరి మధ్య గొడవ జరగగా మామ మొగులయ్య మల్లేష్ భార్యను ఖమ్మంనాచారం గ్రామానికి తీసుకువెళ్లి తిరిగి ఆమెను పంపలేదు. మూడు నెలలుగా మల్లేష్ ఒక్కడే నివాసం ఉం టున్నాడు. దీనితో నేరస్తుడు మామపై పగ పెంచుకొని చంపాలని నిర్ణయించుకున్నాడు. మల్లేశ్ శనివారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో పొలంలో గల గుడిసెలో ఉన్న గొడ్డలి తీసుకొని ఆవుల షెడ్డులో నిద్రిస్తున్న మామ మొగులయ్యను తలపై ముఖంపై గొడ్డలితో కిరాతకంగా నరికి చంపాడు. ఆ గొడ్డలిని తీసుకొని పారిపోతూ మార్గ మధ్యం లో పొదల్లో పారేశాడు. గొడ్డలిని స్వాధీనం చేసుకొని మల్లేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిస్తున్నట్లు పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, దోమ ఎస్సై నాగేందర్‌లు తెలిపారు.

## 10న మాంసం దుకాణాలు బంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ఈనెల 10న మహావీర్ జయంతిని పురస్కరించుకొని మాంసం దుకాణాలను మూసివేయాలని జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ యాక్ట్ -1955 ప్రకారం సెక్షన్ 533 (బి) ప్రకారం ఎవరైనా మాంసం దుకాణందారులు ఆదివారం దుకాణాలు తెరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల నిర్వాహకులు అధికారులకు సహకరించాలని సూచించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి**

సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ ): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ నేరుగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 41 దరఖాస్తులు రాగా అందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి 19, ట్యాక్స్ సెక్షన్ 5, ఇంజనీరింగ్ విభాగం, అడ్మినిస్ట్రేషన్, ఎస్టేట్స్, విజిలెన్స్, వెటర్నరీ, ఫైనాన్స్, హౌజింగ్ విభాగాలకు ఒకటి చొప్పున, భూ సేకరణ, స్పోర్ట్స్ విభాగాలకు మూడు చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా నాలుగు ఫిర్యాదులను స్వీకరించారు. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో 79 అర్జీలు స్వీకరించారు. కూకట్‌పల్లి జోన్‌లో 38, సికింద్రాబాద్‌లో 13, శేరిలింగంపల్లిలో 13, ఎల్బీనగర్‌లో 10, ఖైరతాబాద్‌లో ఒకటి, చార్మినార్ జోన్‌లో నాలుగు అర్జీలను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు.. శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గీతా రాధిక, అడిషనల్ సీసీపీ ప్రదీప్, వాల్యూయేషన్ అధికారి మహేశ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ చేస్తున్న ఈఓ అనురాగ్ జయంతి

## బల్దియాలో బీజేపీ, మజ్లిస్ ఢీ

**లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దాయాది పార్టీల అభ్యర్థులు**

**ఈ నెల 23న పోలింగ్, 25న కౌంటింగ్**

సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, మజ్లిస్ పార్టీ తమ అభ్యర్థులను నిలబెట్టాయి. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పత్రాలను సోమవారం ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి స్క్రూట్నీ చేశారు. ఇందులో స్వతంత్ర అభ్యర్థులు.. కంటే సాయన్న, చంద్రశేఖర్ చాలిక నామినేషన్లు సరైన వివరాలు లేని కారణంగా తిరస్కరణకు గురయ్యాయి. ఎంఐఎం పార్టీ నుంచి మీర్జా రియాజ్ ఉల్ హసన్, బీజేపీ నుంచి డాక్టర్ ఎన్ గౌతంరావు వేసిన నామినేషన్ పత్రాలు అర్హత సాధించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎన్నికల బరిలో బీజేపీ, ఎంఐఎం పార్టీలు తలపడనున్నాయి. కాగా ఈనెల 9న నామినేషన్ల ఉపసంహరణ, 23న పోలింగ్, 25న కౌంటింగ్ జరగనుంది.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటి

## ఆరోగ్య సూత్రాలు పాటించాలి

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి**

సిటీబ్యూరో, ఏప్రిల్ 07, (నమస్తే తెలంగాణ): మానసిక ఒత్తిళ్లు దరిచేరకుండా నడక, వ్యాయమం వంటి ఆరోగ్య సూత్రాలను పాటించి ఆనందంగా జీవించాలని హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి ప్రజలకు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి మూలస్తంభం తల్లీబిడ్డ అని వారి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరమన్నారు. మాతృ, శిశు మరణాలు తగ్గించడానికి వైద్యసిబ్బంది నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ పై దృష్టి పెట్టడంతో పాటు సకాలంలో రోగులను గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ శ్రీధర్, ఏవో డాక్టర్ సాయిబాబా, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అశ్రిత, డెమో అధికారి జక్కుల రాములు, వైద్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.